ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
గురువారం 27 ఫిబ్రవరి 2025


ఉదయం వాహన సేవ సందర్భంగా మాడవీధిలో భక్తజనం



హర హర మహాదేవ

- భక్తులతో పోటెత్తిన శైవాలయాలు
- శివనామస్మరణతో మార్మోగిన శ్రీకాళహస్తి

బ్రహ్మోత్సవాల్లో నేడు
ఉదయం 11 గంటలకు: రథోత్సవం
రాత్రి 8.00 గంటలకు: తెప్పోత్సవం

రాత్రి నందిసేవ

భక్తకోటిని అనుగ్రహించేందుకు బుధవారం రాత్రి నందివాహనంపై స్వామివారు, సింహవాహనంపై అమ్మవారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఊరేగింపును తిలకించేందుకు.. జాగరణచేసి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీకాళహస్తీశ్వరాలయం, మాడ వీధులు కిక్కిరిసిపోయాయి.


కళాకారుల విన్యాసం


వాహన సేవ ముందు భక్తుల నృత్యం


భక్తుల మొక్కులు


నంది, సింహ వాహనాలపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు


ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): 'హరహర మహాదేవ.. శంభశంకర' అంటూ జిల్లాలోని ఈశ్వరాలయాలు బుధవారం శివనామ స్మరణతో మార్మోగాయి. మహాశివరాత్రి సందర్భంగా వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు రావడంతో రద్దీగా కనిపించాయి. దక్షిణ కైలాసంగా పేర్కొనే శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. స్వర్ణముఖి నదిలో స్నానాలు.. పితృదేవతలకు తర్పణం వదిలేవారు.. శంఖం పూరించే జంగమదేవరలు.. స్వామి దర్శనానికి వచ్చిన జనంతో పురవీధులు రద్దీగా మారాయి. మహాశివరాత్రి సందర్భంగా వాయులింగేశ్వరుడు నిజమూర్తి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతిరోజు నాలుగు కాలాల అభిషేకాలు జరిగితే.. శివరాత్రి నాడు మాత్రం (బుధవారం ఉదయం నుంచి గురువారం వేకువన లింగోద్భవం వరకు) 11 కాలాభిషేకాలు నిర్వహించారు. ఇక, బుధవారం వేకువజామున 2 గంటలకు అర్చకులు స్వామి, అమ్మవార్లను మేల్కొలిపారు. పూజల అనంతరం 3 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. రుద్రాభిషేకంతో పాటు పచ్చకర్పూరాభిషేకం, పంచామృతాభిషేకం ఒకదాని వెంట ఒకటి స్వామివారికి నిర్వహించారు. వీటితో స్వామివారు నిత్యాభిషేక మూర్తిగా దర్శనభాగ్యం కల్పించారు. జ్ఞానప్రసూనాంబికదేవికీ అభిషేకాలు నిర్వహించారు. వేకువజామున 4 గంటల నుంచే భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. ఆలయం లోపల భక్తులకు మహాలఘు దర్శన విధానం అమలు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయలింగం నుంచి ఆలయం పైకి వెళ్లి భక్తకన్నప్ప కొండమెట్ల మార్గం వద్దకు చేరుకునేలా ప్రత్యేక మార్గం ఏర్పాటు చేసి మహాద్వారం వైపు రాకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో తోపులాటకు తావులేకుండా పోయింది. క్యూలైన్లలో భక్తులకు తాగునీరు, పాలు, బిస్కెట్లు అందజేశారు. సుమారు లక్షన్నర మంది భక్తులు వచ్చినట్లు ఆలయాధికారుల అంచనా.

మహాప్రసాదంగా వాయనం

ఈసారి భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదం పంపిణీ చేశారు. మహిళలకు రవికతో పాటు పసుపు, కుంకుమ, గాజులను కలిపి వాయనంగా అందించారు. క్యూలైన్లలో భక్తులకు వాటర్‌బాటిళ్లు, బిస్కెట్లు అందజేశారు.


మహిళా భక్తులకు వాయనం అందజేత

ఇంద్ర విమానంపై శివయ్య

బుధవారం ఉదయం ఇంద్ర విమానంపై స్వామి, చప్పరంపై జ్ఞానప్రసూనాంబ దేవి అధిరోహించారు. మూషికవాహనంపై వినాయకుడు, శ్రీవల్లీ, దేవసేన సమేత కుమారస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప చప్పరాలపై ఊరేగింపులో ముందు సాగారు. ఊరేగింపు ముందు కళారూప ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆలయ ఈవో బాపిరెడ్డి, ఉభయదారులు పాల్గొన్నారు.

పటిష్ఠ బందోబస్తు

మహాశివరాత్రికి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కమాండ్ కంట్రోల్ నుంచి ఎస్పీ హర్షవర్ధనరాజు క్యూలైన్లను, క్రౌడ్ కంట్రోల్‌ను పర్యవేక్షించారు. అధికారులకు తగు సూచనలు చేశారు. క్యూలైన్ల వద్ద తోపులాటలు జరగకుండా చర్యలు చేపట్టారు. శ్రీకాళహస్తి పరిసరప్రాంతలలో 398 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పురవీధులలో డ్రోన్ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ చేశారు. ట్రైనీ ఎస్పీ బి.హేమంత్, అదనపు ఎస్పీలు కె.రవిమనోహరాచారి, ఐ.రామకృష్ణ, డీఎస్పీలు నరసింహ మూర్తి (శ్రీకాళహస్తి), రామకృష్ణచారి (తిరుపతి ట్రాఫిక్) చెంచు బాబు (నాయుడుపేట), విజయ్‌శేఖర్ (తిరుమల), సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.


పిండప్రదానాలు





సాయంత్రం నుంచి ట్రాఫిక్ చిక్కులు

శ్రీకాళహస్తిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ అదుపులోనే కొనసాగింది. సాయంత్రం ఆరు గంటల తర్వాత పట్టణవాసులు ద్విచక్ర వాహనాలు, కార్లతో అధిక సంఖ్యలో రోడ్లపైకి వచ్చారు. దీంతో మాడవీధుల్లో ట్రాఫిక్ సమస్య ఎదురైంది. పెళ్లి మండపం, సూపర్ బజార్ కూడలి, రాజగోపురం, బిక్షాల గాలిగోపురం, బేరివారి మండపం, జయరామరావు వీధిలో వాహనాల రాకపోకలు స్తంభించాయి. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ట్రాఫిక్ సమస్యను గుర్తించిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు పోలీసు అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు.











తిరుపతి నగరం కపిలేశ్వరాలయంలో శివలింగం, నాగపడిగల వద్ద భక్తుల పూజలు.. దర్శనానికి పోటెత్తిన భక్తులు - నాగలాపురం మండలం సురుటుపల్లెలోని పల్లికొండేశ్వరాలయంలో స్వామి దర్శనానికి వెళుతున్న భక్తులు - తలకోనలోని సిద్దేశ్వరుడి దర్శనానికి వచ్చిన భక్తులు

వైభవంగా పురుషోత్తముడి చక్రస్నానం

- ముగిసిన కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన బుధవారం ఉదయం చక్రస్నానం నిర్వహించారు. ఉదయం 6.30-7.30 గంటల మధ్య చక్రతాళ్వార్‌తో పాటు ఉత్సవర్లను పల్లకిలో మాడవీధుల్లో ఊరేగించారు. 9 నుంచి 10 గంటల వరకు కంకణ భట్టర్ నారాయణాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవర్లను పుష్కరిణి వద్ద ప్రత్యేక వేదికపై కొలుదీర్చారు. స్నపనతిరుమంజనం నిర్వహించారు. అనంతరం వేద మంత్రాలు, భక్తుల గోవిందనామస్మరణల మధ్య చక్రతాళ్వార్‌కి చక్రస్నానం నిర్వహించారు. అదే సమయంలో భక్తులూ పుష్కరిణిలో స్నానమాచరించారు. సాయంత్రం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు, డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, ఆగమ సలహాదారులు మోహనరంగాచార్యులు, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, అర్చకులు బాలాజీచార్యులు, పార్థసారథి, శేషాచార్యులు, ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్ పాల్గొన్నారు.






పుష్కరిణిలో చక్రతాళ్వార్‌కు చక్రస్నానం తర్వాత స్నానమాచరిస్తున్న భక్తులు

క్యాన్సర్ బాధితులకోసం శ్రీబయో

- మరో రెండు నెలల్లో అందుబాటులోకి
- స్విమ్స్ వార్షికోత్సవంలో డైరెక్టర్ ఆర్వీ కుమార్
- 9 మందికి గోల్డ్ మెడల్.. 35 మంది వైద్యులకు ప్రశంసాపత్రాల ప్రదానం

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ(శ్రీబయో)ని మరో రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ పేర్కొన్నారు. తిరుపతిలోని మహతిలో బుధవారం జరిగిన స్విమ్స్ 32వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ఒకే రోజు మూడు కీలకమైన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేసిన ఘనత స్విమ్స్‌కే దక్కిందన్నారు. స్విమ్స్‌ను దేశంలోనే అత్యుత్తమ వైద్య విజ్ఞాన సంస్థగా అభివృద్ధి చేసే లక్ష్యంగా ప్రభుత్వం, టీటీడీ తోడ్పాటు అందిస్తున్నాయన్నారు. త్వరలోనే ఆప్తమాలజీ, ఈఎన్‌టీ విభాగాల పీజీ కోర్సులు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. డీన్ అల్లాడి మోహన్‌తో కలిసి స్విమ్స్ యూనివర్సిటీ నివేదిక సీడీలను ఆవిష్కరించారు. ఉత్తమ సేవలందించిన ఏడుగురు వైద్యులకు, ఒక ఎంబీబీఎస్ విద్యార్థినికి, ఒక స్టాఫ్‌నర్సుకు గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. మరో 35 మంది వైద్యులకు ప్రశంసాపత్రాలు అందించారు. సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, ఎంఎస్ రామ్, ప్రిన్సిపాల్స్ ఉషా కళావత్, మాధవి, సుధారాణి, వైద్య విభాగాధిపతులు వనజాక్షమ్మ, మధుబాబు, పీవీజీకే శర్మ తదితరులు పాల్గొన్నారు.



వార్షిక నివేదిక సీడీలను ఆవిష్కరిస్తున్న ఆర్వీకుమార్, డీన్ అల్లాడి మోహన్

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

చిత్తూరు లీగల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఓ నిందితుడికి న్యాయస్థానం 20 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువకుడు 12 ఏళ్ల బాలికపై 2019లో అత్యాచారం చేశాడు. దీనిపై స్థానిక పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు మంగళవారం వాయిదాకు రాగా, పూర్వాపరాలు పరిశీలించాక నేరం రుజువుకావడంతో యువకుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.2000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శాంతి తీర్పు చెప్పారు. ఈ కేసును స్పెషల్ పీపీ మోహన కుమారి వాదించారు.

అశ్వవాహనంపై ఎల్లమ్మ దర్శనం



చంద్రగిరి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మూలస్థాన ఎల్లమ్మ బుధవారం అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మహాశివ రాత్రి సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకం చేసి, విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి అశ్వవాహనంపై చంద్రగిరి నుంచి పిచ్చినాయుడుపల్లె వరకు ఊరేగింపుగా తీసుకె ళ్లారు. పిచ్చినాయుడుపల్లెలో గ్రామోత్సవం నిర్వ హించాక అమ్మవారు మామిడి తోటలో కొలువు దీర్చారు. సాయంత్రం ఊరేగింపుగా ఆలయానికి అమ్మవారు చేరుకున్నారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత, పిచ్చినాయుడుపల్లె పినపెద్దలు లింగారెడ్డి, రమేష్‌రెడ్డి, నాగరాజరెడ్డి, హితేంద్రనాథ్‌రెడ్డి, హరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర శంఖాభిషేకం



చంద్రగిరి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): తొండవాడ సమీపంలోని ఉగ్రప్రత్యంగిరాల యంలో బుధవారం సహ్రసశంఖాభిషేకం, చండీహోమం నిర్వహించారు. కాళిపీఠం వార్షి కోత్సవాల సందర్భంగా అమ్మవారి మూలవిరా ట్‌కు అభిషేకం చేసి దర్శనం కల్పించారు. ఉదయం 8 గంటలకు ప్రాతఃకాలార్చన, చండీ హోమం, హనుమగాయత్రి హోమం, జయాది హోమాలు వైభవంగా నిర్వహించారు.. పీఠాధి పతి సూరిస్వామి, వేదపండితులు సీతారామ శర్మ, కార్యనిర్వాహకులు శివశంకర ప్రసాద్, రామమూర్తినాయుడు, భక్తులు పాల్గొన్నారు. .

రెండు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి(ఆంధ్రజ్యోతి): తలకోనలో బుధవారం వేర్వేరుగా జరిగిన రెండు రోడ్డు ప్రమాల్లో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఎస్సై డీవైస్వామి తెలిపిన వివరాలు ఇలా .. కోటకాడ పల్లె పంచాయతీకి చెందిన సాయి, రాఘవలు తలకోన సిద్దేశ్వరస్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. మెదటి, రెండు వంకల మధ్య మలుపు వద్ద వేగంగా వచ్చి ఇండికేటర్‌ను, చెట్టును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో సాయి,రాఘవులు గాయపడ్డారు. సాయి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో 108లో తిరుపతి ఆసుపత్రికి తరలించారు. తలకోన ఆలయానికి దగ్గరలో తాత్కాలిక బస్టాండ్ వద్ద కోడూరుకు చెందిన ఇమ్రాన్ ద్విచక్ర వాహనంపై నుంచి పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చెట్టును ఢీకొన్న ద్విచక్ర వాహనం

శివాలయాల్లో విశేష పూజలు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాయలచె రువుకట్ట భవానీజలకంఠేశ్వర, కోటిలింగేశ్వరాలయాల్లో శివ రాత్రి సందర్భంగా బుధవారం విశేషపూజలు జరిగాయి. తెల్లవారుజామున తిరుమంజనం నిర్వహించి స్వామికి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. రాత్రి ద్రౌపదీ మాన సంర క్షణ వీధినాటకం ఆకట్టుకుంది. అర్ధరాత్రి లింగద్భోవ దర్శ నంతో భక్తులు తరించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఉదయం కామాక్షి సమేత కోటి లింగేశ్వరస్వామి, సాయంత్రం భవానీ, జలకంఠేశ్వరస్వామిల కల్యాణం కమనీయంగా జరిగింది. శక్తిపీఠం, రేకలచేను, రామాపురం బ్రహ్మర్షి ఆశ్రమంలో విశేష పూజలు నిర్వహిం చారు.**తిరుపతి రూరల్:** అవిలాల, మంగళం, పైడిపల్లె, గొల్ల పల్లె, దుర్గసముద్రం, చిగురువాడ, అడ్డప్పారెడ్డి పల్లె, సాయి నగర్, తుమ్మలగుంట గ్రామాల్లోని శివాలయాల్లో బుధవారం మహాశివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు. మంగళం పంచాయతీ తిరుమలనగర్‌లోని అన్నపూర్ణ సమేత ఈశానేశ్వర నవలింగ క్షేత్రం, జంబుకేశ్వరస్వామి ఆలయం, అవిలాలలోని కపిలేశ్వరస్వామిని ఎమ్మెల్యే నాని దర్శించుకున్నారు. పలు ఆలయాలకు వైసీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డిలు సారె సమర్పించారు.



రాయలచెరువు జలకంఠేశ్వరాలయంలో భక్తులు



ఎల్ఎస్‌నగర్‌లోని భ్రమరాంబిక మల్లికార్జునస్వామి

జోరుగా తెలుగుగంగ రెండో పైపులైను పనులు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మంగళం తిరుమలనగర్ తుడా క్వార్టర్స్‌లో తెలుగు గంగ రెండో పైపులైను పనులు జోరుగా సాగుతు న్నాయి. అదనపు నీరు సరఫరాలో భాగంగా తిరు మలనగర్‌కు ఎగువనున్న వాటర్ ఫిల్టర్ హౌస్ నుం చి చెన్నాయగుంట చెరువు వద్ద ఉన్న రా వాటర్ పంపింగ్ స్టేషన్ వరకు రూ.7.5కోట్లతో రెండో పైపు లైను పనులను ఇటీవల ప్రారంభించారు. 1.3 కిలో మీటర్ల దూరం ఉండగా ఇప్పటివరకు సగం దూరం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు కూడా త్వ రగా పూర్తి చేసి, ఏప్రిల్లో అందుబాటులోకి తేవాలని అధికారులు భావిస్తున్నారు. ఇది పూర్తయితే నగరా నికి సరఫరా అవుతున్న నీరు రెట్టింపుకానుంది.



తుడా క్వార్టర్స్‌లో తెలుగుగంగ రెండో పైపులైను


గుడిమల్లానికి పోటెత్తిన భక్తులు

రేణిగుంట, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : గుడిమల్లం పరశురామేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. గత ఏడాది 20వేల నుండి 30 వేల మంది వరకు భక్తులు దర్శించుకుంటే ఈ ఏడాది 30 నుంచి 40వేల పైచిలుకు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల మధ్య పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో గందగోళం నెలకొంది. అదే సమయంలో వీఐపీలను దర్శనానికి వదలడంతో క్యూలైన్లలోని భక్తులు ఆలయ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాహకులు భక్తులకు సర్దిచెబుతుండగా మరో గేటు ద్వారా దర్శనానికి వదలడంతో ఒక్కసారిగా కొంతతోపులాట జరిగింది. పోలీసులు క్యూలైన్ల వద్దకు చేరుకుని భక్తులను క్రమబద్ధీకరించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె అక్కడ మీడియాతో మాట్లాడుతూ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సుధీర్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు.

సీసీరోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మల్లంగుంట పంచాయతీల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కింద రూ.17లక్షల అంచనాతో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో గ్రామంలో 250మీటర్ల పొడవుతో పనులను చేపడుతున్నారు. టీడీపీ నేతలు పార్ల పల్లి మునికృష్ణారెడ్డి, అవిలాల దిలీప్‌కుమార్‌యా దవ్ పర్యవేక్షణలో పనులు నిర్వహిస్తున్నారు.





టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు బుధవారం శ్రీకాళహస్తి ఆలయాన్ని సందర్శించారు. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు ఆయనకు దర్శన ఏర్పాట్లు చేశారు.

చంద్రగిరి

శివనామ స్మరణతో హోరెత్తిన ఆలయాలు



ముక్కోటిలో విశేషాలంకరణలో అగస్త్యేశ్వర స్వామి

ఎర్రావారిపాలె,ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా బుధవారం తల కోనలోని సిద్దేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అధికారులు క్యూలైన్‌లు ఏర్పాటు చేయడంతో తోపులాట లేకుండా భక్తులు సాఫీగా దర్శనం చేసుకున్నారు. తిరు పతి,అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. వీరికి దాతలు నీరు, మజ్జిగ, అన్నప్రసాదాలను వితరణ చేశారు. బుధవారం రాత్రి చేరుకున్న మహి ళలు గురువారం పూజోత్సవం, ప్రసాద స్వీక రణతో దీక్ష విరమిస్తారు. స్వామికి ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. వేకువజామున అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామిని దర్శిం చుకున్నవారిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మోహిత్ రెడ్డి. హర్షిత్ రెడ్డి తదితరులు న్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ప్రధాన అర్చకుడు ప్రసన్నస్వామి, వేద పండి తులు కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ అధి కారి రవీంద్రరాజు దంపతులు, తహసీల్దార్ పర మేశ్వరస్వామి దంపతులు, ప్రధాన అర్చకుల దంపతులు ఉత్సవంలో పాల్గొన్నారు.



సిద్దేశ్వరస్వామిని దర్శించుకుంటున్న పెద్దిరెడ్డి,చెవిరెడ్డి మోహిత్





పరాశరేశ్వరస్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో - తొండవాడలోని ముక్కోటి ఆలయంలో భక్తులు

చంద్రగిరి : తొండవాడలోని అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించాక తెల్లవారుజాయున 4 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం నందికి ప్రదోషపూజ, రాత్రి పార్వతీ పరమేశ్వ రుల ఉత్సవమూర్తులను నంది వాహనంపై ఊరేగించారు. ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు. చంద్ర గిరిలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో ఉదయం రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. శత రుద్రాభిషేకం తర్వాత భక్తులకు దర్శనం కల్పిం చారు. అనంతగుర్రప్పగారిపల్లె, పాండురంగ య్యగారిపల్లె మార్గంలో తీర్థాల కోన ఆలయంలో పూజలు నిర్వహించారు. కందులవారిపల్లె సమీ పంలోని శేషాచలలింగేశ్వరస్వామి ఆలయంలో వివిధ అభిషేకాలు చేశారు. అర్ధరాత్రి దాటాక మహన్యాసపూర్వక రుద్రాభిషేకానంతరం కల్యా ణోత్సవం నిర్వహించారు.

తిరుచానూరు:యోగిమల్లంవరంలోని కామా క్షంబ సమేత పరాశరేశ్వరస్వామి దర్శనానికి బుధవారం భక్తులు పోటెత్తారు. వేకువజామున స్వామివారికి నేత్రపర్వంగా అభిషేకం నిర్వహిం చారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మూలవిరాట్‌కు అభిషేకాన్ని నిర్వహిం చారు. రాత్రి 10గంటల నుంచి నాలుగు పర్యా యాలు రుద్రాభిషేకం జరిగింది. స్వామి అమ్మ వార్ల దర్శనానికి భక్తులు బారులుతీరారు. శుక్ర వారం సాయంత్రం కల్యాణోత్సవం జరుగు తుంది. ముండ్లపూడిలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తిరుచానూరు- కొత్రమంగళం రోడ్డులో స్వర్ణ ముఖి నది తీరాన సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శివలింగానికి అభిషేకం నిర్వహిం చారు. **భాకరాపేట:** చిన్నగొట్టిగల్లులోని భీమేశ్వర స్వామి, నెమలిగుండ్ల, తిప్పిరెడ్డిగారిపల్లె, బండ కొండల్లోని శివాలయాలు కిటకిటలాడాయి. స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. **పాకాల:** శంఖంపల్లె,పాకాల, బ్రహ్మంగారి మఠం, మణిపిరెడ్డిపల్లె, సూరినేనిపల్లె, పాలినేనిపల్లె శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. మణి పిరెడ్డిపల్లె శివాలయంలో శివపార్వతుల కల్యా ణోత్సవం నిర్వహించారు. ఓంశాంతి బ్రహ్మకు మారీల ఆధ్వర్యంలో శివుడ్ని ఊరేగించారు.

తిరుచానూరు: తిరుచానూరులో ఓ ప్రైవేటు సంస్థ నిర్వహించిన మహాశివరాత్రి ఉత్సవాలు జరిగాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొన్నారు. రుద్రగణపతి హోమం, మృత్యుంజయ హోమం, శివపార్వతుల కల్యాణం జరిగింది. పలువురు సినీగాయకులు ఆలపించిన గీతాలు ఆధ్యాత్మిక విందుపంచాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



తలకోన సిద్దేశ్వరస్వామికి పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న ఎమ్మెల్యే నాని దంపతులు



పాకాలలో ఓంశాంతి బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఊరేగింపు



తలకోన ఆలయంలో స్వామి కల్యాణం

శ్రీవారి సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమా చారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెం ట్లలో టైం స్లాట్ భక్తులు వేచిఉన్నారు. సోమ వారం రూ.4.29 కోట్లు హుండీ ఆదాయం లభించింది. మంగళవారం శ్రీవారిని 65,127 మంది దర్శించుకున్నారు. భక్తులు:19,307 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



గాయని స్మిత

తిరుమల, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, గాయని స్మిత, ఐపీఎస్ అధికారి రాహుల్‌దేవ్ శర్మ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఎక్కడా సారా కనిపించకూడదు

● ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంటు డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ



మాట్లాడుతున్న రాహుల్‌దేవ్ శర్మ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నవోదయం-2ను పక్కాగా అమలు చేసి.. చిత్తూరు ఉమ్మడి జిల్లాలో సారా కనిపించకుండా చేయాలని ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంటు డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ఆదే శించారు. తిరుపతి ఎక్సైజ్ జిల్లా సూపరింటెం డెంట్ కార్యాలయంలో బుధవారం ఆయన ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అధికారులతో సమావేశ మయ్యారు. రెండు జిల్లాల పరిధిలో ఇప్పటివ రకు ఎన్ని కేసులు నమోదు చేశారు? ఎంత మందిని అరెస్టు చేశారు? ఎన్ని లీటర్ల ఊట ధ్వంసం చేశారనే వివరాలు తెలుసుకున్నారు. సారా ఎక్కువగా తయారు చేస్తున్న గ్రామా లను గుర్తించి, ప్రత్యేక టీమ్‌ల ద్వారా కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్, సూపరింటెండెంట్లు నాగమల్లేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, వాసుదేవచౌ దరి, ఊహశ్రీ పాల్గొన్నారు.

ఆక్రమణ అడ్డగింత

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండల సముదాయం ఎదు రుగా సర్వే నెంబరు 253లో ఉన్న భూమిని ఇంటి స్థలాలుగా ఇవ్వాలని రెండు మా సాలుగా కనమనంబేడు గ్రామస్తులు ధర్నాలు, నిరసనలు చేపట్టారు. అధికారులు స్పందించకపోవడంతో బుధవారం ఆక్రమ ణకు యత్నించారు. ఆర్ఐ నల్లయ్య, వీర్వో బాలమురళి, పోలీసులు వారిని అడ్డుకు న్నారు.

84 మంది విద్యార్థులకు ఊరట

● చిత్తూరు జిల్లాలో పరీక్ష రాసేలా అనుమతించిన ఇంటర్‌బోర్డు

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 26 (ఆంధ్ర జ్యోతి): చిత్తూరు, తిరుపతి జూనియర్ కళాశా లల యాజమాన్యాల నిర్వాకంతో 84 మంది విద్యార్థులకు హాల్ టికెట్లు రాని విషయం తెలి సిందే. ఎట్టకేలకు వీరికి చిత్తూరు జిల్లానే పరీ క్షలు రాసేలా ఇంటర్‌బోర్డు అధికారులు అను మతించడంతో కథ సుఖాంతమైంది. వివరాల్లోకి వెళితే.. పెనుమూరులో శ్రీవెంకటేశ్వర జూని యర్ కళాశాలను నిర్వాహకుడు సురేంద్రరెడ్డి ఏడాది కిందట తిరుపతి బైరాగిపట్టెడలోని ఎస్ ఎస్ఆర్ కళాశాలకు చెందిన ఓంప్రకాష్ అనే వ్యక్తికి అమ్మేశాడు. ఈ క్రమంలో తిరుపతికి చెందిన 84 మంది విద్యార్థుల పేర్లు మాత్రం పెనుమూరులోని కళాశాలలో ఉన్నట్లు ఇంటర్మీ డియట్ లాగిన్‌లో నమోదైంది. నిర్వాహకుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లించ లేదు. దీంతో హాల్ టికెట్లు రాలేదు. ఈ వ్యవ హారం రెండు జిల్లాల్లో చర్చనీయాంశంగా మారి, చివరకు కమిషనరేట్ కార్యాలయానికి చేరింది. అక్కడి అధికారుల సూచనతో విచారణ చేపట్టా లని డీవీఈవో సయ్యద్ మౌలను కలెక్టర్ సుమి త్ కుమార్ ఆదేశించారు. పెనుమూరు కళాశాల నిర్వహణ లోపాన్ని గుర్తించిన అధికారులు.. యాజమాన్యానికి నోటీసులు కూడా ఇచ్చారు. దీనిపై 'లేని కాలేజ్.. ఉన్నట్లుగా..!?' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఆదివారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.

మానవతా దృక్పథంతో..

84 మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షలు రాసే అవకాశం ఇవ్వాలని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు పెను మూరు కళాశాలను కొనుగోలు చేసిన తిరుపతి ఎస్ఎస్ఆర్ కళాశాల నిర్వాహకుడు ఓంప్రకాష్ విజ్ఞప్తి చేశారు. మానవతా దృక్పథంతో కళాశా లకు ఫైన్ విధించడంతోపాటు పెద్ద మొత్తంలో అపరాధ రుసుంతో విద్యార్థుల ఫీజు చెల్లించే వీలును ఇంటర్మీడియట్ బోర్డు అధికా రులు కల్పించారు. అయితే తిరుపతికి చెందిన విద్యార్థుల పేర్లు చిత్తూరు జిల్లా కింద నమోదై ఉన్నాయి. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలను కూడా చిత్తూరులోనే కేటాయించాలని బోర్డు అధికారులు డీవీఈవోకు సూచించారు. 84 మంది విద్యార్థులకు ఒకే సెంటర్ కేటాయిస్తే ప్రశ్నపత్రాల సమస్య తలెత్తుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఒక్కో సెంటర్‌కు ఆరు నుంచి ఏడుగురు విద్యార్థుల చొప్పున చిత్తూరు జిల్లా కేంద్రంలోని పలు సెంటర్లు కేటాయించినట్లు డీవీఈవో తెలిపారు. దీంతో తిరుపతి విద్యా ర్థులు ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షలు చిత్తూరు జిల్లాలో కేటాయించిన సెంటర్లలో రాయనున్నారు.

తిరుమల క్షేత్రపాలకుడికి వైభవంగా అభిషేకం



తిరుమల, ఫిబ్రవరి26 (ఆంధ్రజ్యోతి): తిరుమల గోగర్భం సమీపంలోని రుద్రుని రూపమైన క్షేత్రపాల కుడికి బుధవారం వైభవంగా అభిషేకం జరిగింది. మహాశివ రాత్రి సందర్భంగా బుధవారం మధ్యాహ్నం శ్రీవారి ఆలయం నుంచి ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు క్షేత్రపాలక శిల వద్దకు చేరుకున్నారు. పాలు, పెరుగు, చందనం, పన్నీరు, కొబ్బరినీళ్లు తదితర ద్రవ్యాలతో విశే షంగా అభిషేకం నిర్వహించారు. తర్వాత నైవేద్యం సమర్పించి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అంతకుముందు తిరుమల స్థాని కులు, వ్యాపారాలు కూడా రుద్రునికి అభిషేకం చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహిం చారు. వివిధ ప్రాంతాల భక్తులు వచ్చి క్షేత్రపా లకుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పారుపత్తేదారు హిమత్‌గిరి, ఆర్జితం ఇన్‌చార్జ్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

అవస్థలమయం అర్ధనారీశ్వర దర్శనం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అర్ధనా రీశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. అయితే సరైన సౌకర్యాలు, వసతులు లేక భక్తులకు అడుగడుగునా అవస్థలు తప్పలేదు. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని బైపాస్ వంతెనకు సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున అర్ధ నారీశ్వరాలయం వెలసిన విషయం తెలిసిందే. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఈ ఆలయ నిర్వహణ సాగుతోంది. బుధవారం మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని భక్తులు అర్ధ నారీశ్వరాలయానికి భారీగా తరలివచ్చారు. సుమారు 25వేల మందికి పైగా ఆలయానికి విచ్చేశారు. అర్ధనారీశ్వరాలయ మండపం పునర్నిర్మాణం జరుగుతోంది. భారీఎత్తున భక్తులు వస్తారని తెలిసినా అధికారులు అవసరమైన స్థాయిలో ఏర్పాట్లు చేయలేదు. క్యూలైన్లు గంటల కొద్దీ స్తంభించిపోయాయి. క్యూలైన్ల వద్ద ఒక్క ఫ్యాన్ కూడా ఏర్పాటు చేయలేదు. గంటల పాటు క్యూలైన్లలో ఉక్కపోతతో భక్తులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. కనీసం క్యూలైన్లలో తాగునీరు లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్యం ఊసే లేదు. అదేవిధంగా బైపాస్ వంతెన నుంచి ఆలయం వరకు మట్టిరోడ్డుపై కనీసం నీరు కూడా చల్లకపోవడంతో దుమ్ముతో భక్తులు ఇబ్బందిపడ్డారు.



అర్ధనారీశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు

21 టన్నుల గుట్కా స్వాధీనం

● అనుమతి పత్రాలు చూపడంతో వదిలేసిన పోలీసులు



రేణిగుంట, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : 21 టన్నుల గుట్కాను ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీ సులు సంయు క్తంగా పట్టుకున్నారు. ఈ సంఘటన బుధవారం ఉదయం స్థానిక రైల్వే గూడ్స్ యార్డులో చోటుచేసుకుంది. ఢిల్లీలో తయారైన 21 టన్నుల గుట్కాను రైల్వే గూడ్స్ క్యారియర్ కోచ్‌లో రేణిగుంట రైల్వే స్టేషన్‌కు తరలించారు. ఇక్కడి నుంచి మూడు లారీల ద్వారా బెంగళూరుకు తరలించే క్రమంలో పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వ అనుమతులు, లైసెన్సు లతోనే రవాణా చేస్తున్నామని ఇందుకు సంబంధించిన పత్రాలతో పాటు హైకోర్టు ఆర్డర్ కాపీలను కంపెనీ సభ్యులు చూపించడంతో పోలీసులు గుట్కా లారీలను వదిలేశారు.

పన్నులు ఎగవేసేందుకే..? : ఒక రాష్ట్రంలో తయారయ్యే వస్తువును మరో రాష్ట్రంలో విక్రయించాలి అంటే ఆ రాష్ట్ర నిబంధనల మేరకు జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే కర్ణాటక రాష్ట్రంలో గుట్కాకు అధికంగా ట్యాక్స్ ఉండడంతో గుట్కాను రేణిగుంటలో దించుకుని ఇక్కడి నుంచి కర్ణాట కకు తరలిస్తున్నారని సమాచారం. అదే సమయంలో తమిళనాడులో గుట్కాపై నిషేధం ఉండడంతో రేణిగుంట నుంచి అటు తమిళనాడుకు సైతం తరలిస్తున్నారని అనుమానం ఉంది. గూడ్సు ద్వారా తక్కువ చార్జీలతో బెంగళూరుకు సరుకు తరలించే అవకాశం ఉన్నా రేణిగుంట నుంచి తరలించడం ఇందుకు బలం చేకూరుస్తోంది.

నేడు రథోత్సవం, తెప్పోత్సవం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం రథోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 11గంటలకు రథోత్సవం ప్రారంభం కానుంది. శ్రీకాళ హస్తీశ్వరుడు ఒక రథంపైన... జ్ఞానప్రసూనాంబదేవి మరో రథంపై ఊరేగనున్నారు. రాత్రి నారదపుష్కరణిలో శివపార్వతులు తెప్పలపై విహరిం చనున్నారు. ఇందు కోసం నారద పుష్కరణిని సుందరంగా తీర్చిదిద్దారు.

నిత్య ఉత్సవాల వివరాలు ఇవీ...

- ఉదయం 2 నుంచి 6 గంటల వరకు: లింగోద్భవ దర్శనం
- ఉదయం 2 గంటలకు : పదవ అభిషేకం- శుద్ధి అభిషేకం
- ఉదయం 4.30గంటలకు: పదకొండవ అభిషేకం - బ్రహ్మాభిషేకం (లింగోద్భవం)
- ఉదయం 9గంటలకు: శ్రీస్వామి అమ్మవార్ల పురవీధుల ఉత్సవం
- ఉదయం 11గంటలకు: రథోత్సవం
- సాయంత్రం 5.30గంటలకు : ప్రదోష కాలాభిషేకం
- రాత్రి 8గంటలకు తెప్పోత్సవం
- రాత్రి 9.30గంటలకు: దర్శనం ముగింపు

ముక్కంటి సేవలో కలెక్టర్



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివ రాత్రి వేడుకలను పురస్కరిం చుకుని జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వ రాల యాన్ని బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్ కుటుంబ సమే తంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు.

హరహర మహాదేవ శంభోశంకర

శివనామ స్మరణతో మార్మోగిన కపిలేశ్వరాలయం - అంగరంగ వైభవంగా రథోత్సవం



తిరుపతి(కపిలతీర్థం), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం ఉదయం నుంచి తిరుపతి కపిలేశ్వరాలయం శివనామస్మరణతో మార్మోగింది. ఉదయం ఆరు గంటల నుంచే సర్వదర్శనం ప్రారంభమైంది. 7 గంటలకు కపిలేశ్వర స్వామి రథోత్సవం భజన మండళ్ల కోలాటాలు, చెక్కభజనలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో అంగరంగ వైభవంగా జరిగింది. 11 నుంచి 12 గంటల మధ్యన స్నపన తిరుమంజనం నిర్వహించారు. సోమస్కందమూర్తి, కామాక్షిదేవి అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, పండ్లరసాలు, చందనంతో అభిషేకం చేశారు. స్వామి, అమ్మవార్లకు ఉపచారాలు నిర్వహించారు. రాత్రి కపిలేశ్వరస్వామి వారు నంది వాహనంపై ఆసీనులై అంబారీలు, బసవన్నలు ముందు నడవగా మంగళ వాయిద్యాలు, చెక్కభజనలు, కోలాటాల నడుమ సాక్షాత్తు కైలాసం నుంచి శివయ్య కపిలతీర్థం కూడలికి దిగొచ్చి తాండవం చేసినట్లు భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

● కిటకిటలాడిన ఆలయం

మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం ఉదయం కపిలేశ్వరాలయ ప్రాంగణం, కూడలి భక్తుల తాకిడితో కిటకిటలాడింది. పిల్లలు, పెద్దలు, వృద్ధులు ఉపవాస దీక్షతో ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల రద్దీ దృష్ట్యా కపిలతీర్థం కూడలిలో పోలీసులు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించారు. భక్తుల వాహనాలకు ఫారెస్ట్ ఆఫీసు లోపల పార్కింగ్ ఏర్పాటు చేశారు. కపిలతీర్థం కూడలి, కపిలతీర్థం గార్డెన్, పుష్కరిణి, ఆలయ ఆవరణలో విద్యుత్‌దీపకాంతులు భక్తులను ఆకట్టుకున్నాయి. కపిలేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం పురుషామృతవాహనం, సాయంత్రం శివపార్వతుల కల్యాణోత్సవం, రాత్రి తిరుచ్చి ఉత్సవాలు జరుగుతాయి.







విశేషాలంకరణలో జీవలింగేశ్వరుడు

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): హరహర మహాదేవ శంభో శంకర... ఓం నమః శివాయ.. ధ్వనులతో జీవకోనలోని జీవలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం మార్మోగింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. విశేషాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచి రాత్రి వరకు నిత్య పూజలతో పాటు ప్రత్యేక అభిషేకాలు, కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా జీవకోన మహాభారత వ్యవస్థాపక ధర్మకర్త, ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నా రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. నిర్విరామంగా తీర్థ, అన్నప్రసాద వితరణ చేపట్టారు.



కొనసాగిన వెటర్నరీ విద్యార్థుల సమ్మె



తిరుపతి రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారమూ కొనసాగింది. వర్సిటీ ప్రధాన గేటు ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో విద్యార్థులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు సమ్మెను కొనసాగిస్తామని విద్యార్థులు పేర్కొన్నారు.

ఆదరణ వృద్ధాశ్రమానికి చేయూత



ఆహార పదార్థాలు అందజేస్తున్న శ్రీనివాస్, ఆర్క్యాట్ కృష్ణప్రసాద్

తిరుపతి (ఆటోనగర్), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా తిరుపతి లైన్స్ క్లబ్ వారు బుధవారం స్థానిక ఆదరణ వృద్ధాశ్రమానికి ఆహార పదార్థాలు వితరణ చేశారు. అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, ఆర్క్యాట్ కృష్ణప్రసాద్‌లు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా భావించి వృద్ధులకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జగన్నాథం, ఈశ్వర్‌రెడ్డి, శాంతి, శేషాద్రి పాల్గొన్నారు.

ఆటోవర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులుగా సురేష్, వెంకటేష్



సురేష్ - వెంకటేష్

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆటోవర్కర్స్ యూనియన్ తిరుపతి నగర అధ్యక్షుడిగా సురేష్, కార్యదర్శిగా వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎన్‌డీ రవి తెలిపారు. తిరుపతిలో రెండు రోజుల పాటు జరిగిన నగర మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కోశాధికారిగా సతీష్, గౌరవాధ్యక్షుడిగా ఎన్.శివ, సలహాదారుడిగా ఎన్‌డీ రవి, ఉపాధ్యక్షులుగా కుమార్, భాస్కర్, కృష్ణ, ప్రమీల, సహాయ కార్యదర్శులుగా పార్వతి, భూపాల్, కాశీ, లక్ష్మణ్‌తో పాటు 17 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ఈ ఎన్నికలు రాష్ట్ర నాయకులు పి.హరినాథరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, కె.రాధాకృష్ణ సమక్షంలో ఎన్నికలు నిర్వహించామని తెలిపారు.

బస్సు పాస్ కౌంటర్ దిశ మార్పు

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సీబీఎస్ ఏడుకొండల బస్టాండులో ఉన్న బస్సుపాస్ జారీ కేంద్రం దిశను మార్చాలని డీపీటీవో నరసింహులు ఏటీఎం రామచంద్రనాయుడును ఆదేశించారు. ప్రస్తుతం ఆ కౌంటర్ తిరుమల బస్సులు వెలుపల వచ్చే మార్గం వైపుగా ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని గుర్తించి, ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

తలకోన బస్సుల కోసం నిరీక్షణ



నిరీక్షిస్తున్న ప్రయాణికులు

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా బుధవారం తలకోన బస్సుల్లో రద్దీ కనిపించింది. ఆర్టీసీ అధికారులు ముందస్తుగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినా అవి ఏమాత్రమూ సరిపోకపోవడంతో ప్రయాణికులకు నిరీక్షణ తప్పలేదు. గంటకు ఆరు బస్సుల చొప్పున తిప్పినా సీట్లకోసం పోటీపడడం కనిపించింది. శ్రీకాళహస్తికి కూడా రద్దీ కనిపించింది. జిల్లావ్యాప్తంగా 177 బస్సులను తలకోన, గుడిమల్లం, సదాశివకోన, కైలాసకోన, మూలకోన, అవంతి, పంట్రంగంలలోని శైవక్షేత్రాలకు భక్తులను తరలించారు. అలాగే పల్నాడు జిల్లాలోని కోటప్పకొండకు వంద బస్సులను, శ్రీశైలానికి 40, మదనపల్లెకు 30 బస్సులు తరలించారు. తిరుమలకు రద్దీ తక్కువగా ఉండడంతో ఉన్న బస్సులతో సర్దుబాటు చేశారు. బస్టాండులో ఏర్పాట్లను, ప్రయాణికుల రద్దీని డీపీటీవో నరసింహులు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, ఏటీఎం రామచంద్రనాయుడు పర్యవేక్షించారు.

నలుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్ట్

12 దుంగల స్వాధీనం



మంగళం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాపూరు మండలం మార్లపూడి అటవీ పరిధిలో స్టార్‌స్పోర్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహించి నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి, వారి నుంచి 12 ఎర్రచందనం దుంగలు, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ ఆర్ఐ కృపానందకు చెందిన ఆర్ఎస్ఐ రాఘవేంద్ర టీమ్, ఎఫ్ఆర్‌వో మాన్యాద్రి, ఎఫ్బీవో మహేష్‌తో కలిసి మంగళవారం తిరుపతి జిల్లా ఫారెస్ట్ డివిజన్ పరిధిలో కూంబింగ్ చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున రాపూరు మండలం గుండూరుపల్లె సమీపంలో కొంతమంది వ్యక్తులు రెండు మోటారు సైకిళ్లతో నిలబడి ఉండడాన్ని గమనించారు. పారిపోవడానికి ప్రయత్నించగా వెంబడించి నలుగురిని పట్టుకున్నారు. వారు నెల్లూరు జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. ఆ ప్రాంతంలో దాచి ఉంచిన 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్ట్ చేశారు. వారిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్టేషన్‌కు తరలించి, ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ముక్కంటి సేవలో 'కన్నప్ప'



ఆలయం వద్ద మోహన్‌బాబు, విష్ణు, ప్రభుదేవా తదితరులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా బుధవారం కన్నప్ప సినిమా బృందం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. మోహన్‌బాబు, విష్ణు, కొరియోగ్రాఫర్ ప్రభుదేవా తదితరులు దర్శించుకున్న వారిలో ఉన్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద కన్నప్ప బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. వీరికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, బీజేపీ నేత కోలా ఆనంద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వనాథ ఆలయంలో..



ప్రత్యేకాలంకరణలో కాశీవిశ్వనాథస్వామి

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వనాథ ఆలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అభిషేకం, నిత్య కైంకర్యాల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ప్రసాదాల వితరణ చేశారు.

వేడుకగా సుషుమ్న క్రియా మహాధ్యానం



అనుగ్రహ భాషణం చేస్తున్న ఆత్మానందమయి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా తిరుపతిలో సుషుమ్న క్రియా మహాధ్యాన కార్యక్రమం వేడుకగా సాగింది. వేంకటేశ్వర యూనివర్సిటీ తారకరామా స్టేడియంలో బుధవారం ఈ వేడుక చేపట్టారు. దివ్య బాలాజీ సుషుమ్న క్రియా యోగ ఫౌండేషన్ - ఎస్వీ యూనివర్సిటీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ప్రఖ్యాత ఆధ్యాత్మికవేత్త ఆత్మానందమయి మాతాజీ అనుగ్రహ భాషణం చేశారు. 144 ఏళ్లకు ఒకసారి చేపట్టే మహా కుంభమేళా చివరి రోజున, శివరాత్రి సందర్భంగా వేంకటేశ్వరుడి సన్నిధిలో సుషుమ్న క్రియా మహాధ్యానం తిరుపతిలో చేపట్టడం శుభ పరిణామమని తెలిపారు. సుషుమ్న క్రియా యోగ ధ్యానం చేపట్టే విధానంలో గల సూక్ష్మాలను తెలియజేశారు. ఒత్తిడిని అధిగమించడానికి సుషుమ్న క్రియా యోగ ధ్యానం ఉపకరిస్తుందని అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆత్మానందమయి మాతాజీ సుషుమ్న క్రియా యోగ దీక్ష, మహాలింగ బిల్వార్చన, సుస్వర భక్తి సంగీత, నృత్య కార్యక్రమాలు, మహా లింగోద్భవ ధ్యానం, రుద్రాక్ష వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో శాంతాబయోటెక్ వరప్రసాద రెడ్డి, ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, డీఎస్పీ శ్రీలత, శృతి కీర్తి పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన జనం

రుయా పోలీసు అవుట్ పోస్టు మార్పునకు రంగం సిద్ధం

అత్యవసర విభాగం ముందు ఏర్పాట్లు



రుయాస్పత్రిలోని పోలీస్ అవుట్ పోస్టు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో పోలీసు అవుట్ పోస్టును అత్యవసర విభాగం ముందుకు మార్చేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ప్రస్తుతం రుయాస్పత్రిలోని పరిపాలనా భవనం పక్కన ఉన్న దుకాణ సముదాయంలో ఓ గదిలో పోలీసు అవుట్ పోస్టు నడుస్తోంది. అయితే అక్కడ అది ఉన్నట్లు కూడా ఎవరికీ తెలియడం లేదు. పైగా ఆస్పత్రిలో అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు సకాలంలో అవుట్ పోస్టులోని సిబ్బంది స్పందించడం లేదు. దీనికితోడు అత్యవసర విభాగం ముందు రాత్రిళ్లు నిత్యం అనేక గొడవలు జరుగుతున్నాయి. సిబ్బందిపైనా దాడులు పెరుగుతున్నాయి. చోరీలూ చోటు చేసుకుంటున్నాయి. పోలీసు అవుట్ పోస్టులోని సిబ్బంది సమయానికి అందుబాటులో లేకపోవడం వల్లే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని రుయా అధికారులు గ్రహించి దాన్ని అత్యవసర విభాగం ముందుకు మార్చేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. అత్యవసర విభాగం ముందు ఉన్న పాత ఓపీ గదిని సిద్ధం చేస్తున్నారు.

అలిపిరి స్టేషన్‌లో మందుబాబు వీరంగం

● కానిస్టేబుల్‌పై దాడి

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అలిపిరి పోలీసు స్టేషన్‌లో బుధవారం సాయంత్రం ఓ మందుబాబు వీరంగం చేశాడు. కానిస్టేబుల్‌పై చేయిచేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. చంద్రశేఖర రెడ్డి కాలనీకి చెందిన లోకేష్ బుధవారం సాయంత్రం కరకంబాడి రోడ్డులోని ఓ బార్ వద్ద వీరంగం చేశాడు. మద్యం మత్తులో రోడ్డుపై వెళుతున్న వారితో గొడవకు దిగాడు. దీంతో కొందరు డయల్ 100కు ఫోన్ చేశారు.అలిపిరి ఎస్ఐ లోకేష్‌బాబు అతడిని అదుపులోకి తీసుకుని అలిపిరి స్టేషన్‌కు తీసుకొచ్చారు.కౌన్సెలింగ్ ఇస్తున్న సమయంలోనూ అతడు హల్‌చల్ చేశాడు. విధుల్లోని సిబ్బందికి ఆటంకం కలిగించాడు. కానిస్టేబుల్ గంగాసాగర్‌పై చేయి చేసుకోగా.. ఆయన కాలు స్లిప్ అయి కింద పడే సమయంలో పక్కనే ఉన్న సిబ్బంది పట్టుకున్నారు. దీనిపై విచారించి అలిపిరి ఎస్ఐ లోకేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉన్నపళంగా దారి మూసేస్తే ఎలా?

శివజ్యోతినగర్ వాసుల ఆవేదన



గోడ నిర్మాణాన్ని అడ్డుకుంటున్న శివజ్యోతినగర్, జీవకోన వాసులు

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): '30 ఏళ్లుగా ఈ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తున్నాం.. అలాంటిది ఉన్నపళంగా మూసేస్తే మేము ఎలా వెళ్లాలి..' అంటూ శివజ్యోతినగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి నగర పరిధి 45వ డివిజన్‌లోని శివజ్యోతినగర్‌తో పాటు జీవకోనవాసులు రాకపోకలు సాగించే రోడ్డుకు అడ్డం(ఎస్‌వీఎస్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ వద్ద)గా గోడ కట్టేందుకు బుధవారం మున్సిపల్ అధికారులు వచ్చారు. స్థానికులు గుమికూడి 30 ఏళ్లకుపైగా ఈ మార్గాన్ని వినియోగించుకుంటున్నామని, అలాంటిది మూసేస్తే రాకపోకలు ఎలా సాగించాలని నిలదీశారు. స్థల యజమాని హైకోర్టు ద్వారా ఉత్తర్వులు ఇవ్వడంతో గోడ కట్టేందుకు వచ్చామని కార్పొరేషన్ డీఈ రమణ తెలిపారు. గోడ పనులు ప్రారంభించడంతో స్థానికులకు, అధికారులకు కొంత వాగ్వివాదం చోటుచేసుకుంది.పోలీసులు అక్కడికిచేరుకునివారిని శాంతింపజేశారు.

న్యాయం చేయాలి



ఇదేదారిలో 30 ఏళ్లుగా రాకపోకలు సాగిస్తున్నాం. ఈ దారి లేకపోతే అంబులెన్స్ అగ్నిమాపక వాహనం, నీటి ట్యాంకులు రావాలన్నా ఇబ్బంది అవుతుంది. ఈ వ్యవహారంపై స్థానికులతో కలిసి ఇదివరకే హైకోర్టులో కేసు కూడా వేశాం. పాలకులు, అధికారులు దృష్టి సారించి, న్యాయం చేయాలి.

- రెడ్డి రాజన్న, ఎస్‌వీఎస్ ఎన్‌క్లేవ్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు

దారి కొనసాగించాలి..



30 ఏళ్లుగా వాడుకుంటున్న దారిని ఉన్నట్లుండి మూసేస్తే ఎలా? దాన్ని మూసేస్తే కూతవేటు దూరంలోని తిరుమల బైపాస్ రోడ్డుకు చిన్నపాటి సందుల్లో వెళ్లాల్సి ఉంటుంది. అత్యవసర సేవలను వినియోగించుకోలేం. ఎమ్మెల్యే స్పందించి, దారిని కొనసాగించేలా సహాయ చర్యలు చేపట్టాలి.

- సంపూర్ణ, స్థానికురాలు శివజ్యోతినగర్

సొమ్మసిల్లి పడిపోయిన సాధువు

● తలకు బలమైన గాయం



శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి: శ్రీకాళహస్తీశ్వరాలయం మూడో గేటు వద్ద బుధవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని సాధువు క్యూలైన్లో సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. తల వెనుక బలమైన గాయం కావడంతో రక్తస్రావం జరిగింది. వెంటనే ఆలయ అంబులెన్సులో ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, బుధవారం సాయంత్రం ఆలయంలోని దక్షిణామూర్తి సన్నిధిలో తెలంగాణకు చెందిన భక్తుడు.. రాజమహేంద్రవరానికి చెందిన ఓ మహిళ వేర్వేరు సమయంలో సొమ్మసిల్లి పడిపోయారు. వీరు ఉపవాస దీక్ష వల్ల నీరసించి పడినట్లు వైద్యవర్గాలు తెలిపాయి. వైద్య సిబ్బంది హుటాహుటిన సహాయక చర్యలు అందించారు.

దుర్భాషలాడిన ఉద్యోగిపై విచారణకు ఆదేశం

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శిక్షణలో ఉన్న డ్రైవర్‌ను దుర్భాషలాడిన ఆర్టీసీ రెగ్యులర్ ఉద్యోగి నారాయణపై డీపీటీవో నరసింహులు బుధవారం విచారణకు ఆదేశించారు. సమగ్ర నివేదిక ఇవ్వాలని తిరుమల అసిస్టెంట్ మేనేజర్ రమణను కోరారు. విధులను పక్కనపెట్టి విచారణకు హాజరుకావాలని నారాయణను ఆదేశించినట్లు తెలుస్తోంది.

పుత్తూరు వార్తలు

భక్తులతో పోటెత్తిన శివాలయాలు




ప్రత్యేక అలంకరణలో కామాక్షి సమేత సదాశివుడు, ప్రసాదాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు టౌన్/ అర్బన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం మండలంలోని శివాలయాలు హర హర మహాదేవ శంభోశంకర నామస్మరణతో మార్మోగాయి. వేకువ జామున నుంచి ఆలయాలు భక్తులతో కిక్కరిసింది. పట్టణంలోని కామాక్షి దేవి సమేత సదాశివాలయం, ఆరేటమ్మ ఆలయం వద్ద ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సదాశివాలయంలో అభిషేకాలు, బిల్వదళాలతో అర్చనలు చేశారు. ఆలయాల వద్ద పలువురు అన్నదానాలు చేశారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కామాక్షి దేవి సమేత సదాశివేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తొర్రూరులో వెలసిన కామాక్షి సదాశివేశ్వర ఆలయం, రాచపాలెంలోని కాశీ విశ్వనాథస్వామి ఆలయం, నగరి, వడమాలపేట, రామసముద్రం ప్రాంతాల్లోని ఆలయాలను ఎమ్మెల్యే దర్శించుకున్నారు. గుడిమల్లం పరసురామేశ్వరస్వామి ఆలయంలోని శివలింగం మాదిరి శివలింగం భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే సదాశివకోన ముఖ ద్వారం నాగిలేరు వద్ద సదాశివకోన నాగిలేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన నారాయణాద్రి వైద్యశాల, వాసన్ ఐకేర్ సమక్షంలో శివ భక్తులకు ఉచిత వైద్య సేవలందించారు. వైస్ చైర్మన్ ప్రతాప్ రాజు ఆధ్వర్యంలో రాచపాళెంలో వెలిసిన కనకదుర్గమ్మ మహాలక్ష్మి ఆలయ ఆర్చను నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ప్రారంభించారు.

భక్తుల సేవలో స్కౌట్స్ అండ్ గైడ్స్

స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లు పుత్తూరు, సమీప ఆలయాల్లో భక్తులకు సేవలందించారు.

వైభవంగా లింగోద్భవం



విశేష అలంకరణలో సదాశివుడు

వడమాలపేట, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సదాశివకోనలో బుధవారం వేకువజామున సదాశివేశ్వర స్వామి లింగోద్భవ అభిషేకం వైభవంగా జరిగింది. భక్తులతో సదా శివకోన కిటకిటలాడింది. భక్తులకు మూడు రోజులుగా వడమాలపేట, ఏర్పేడు, పుత్తూరు మండలాలకు చెందిన పలు అన్నదాన సంఘాలు నిరంతరాయంగా అన్నదానం చేశారు. అలాగే ఓటీఆర్ కండ్రిగ వెదళ్ల చెరువు వద్ద ఉమామహేశ్వర్ స్వామి ఆలయంలో భస్మాసుర అభిషేకం, చండీ హోమం నిర్వహించారు. అరుణగిరి కొండ చుట్టు ఉత్సవంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అప్పలాయగుంటలోని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వ హించారు.

బాలినాయుడు కండ్రిగలో కోలాహలంగా జల్లికట్టు



ఎద్దును నిలువరిస్తున్న యువకులు

వడమాలపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలినాయుడు కండ్రిగలో బుధవారం జల్లికట్టును కోలాహలంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. గిత్తల కొమ్ములకు పట్టీలు కట్టి జల్లిలోకి వదిలారు. పట్టీలను దక్కించు కోవడానికి యువకులు పోటీపడ్డారు. ప్రారంభంలోనే ఓ కోడెగిత్త అదుపుతప్పి బావిలోకి దూకింది. తరువాత అతికష్టం మీద బయటకు తీశారు. దీంతో జల్లికట్టుకు ఆటంకం ఏర్పడింది. పలువురు యువకులకు స్వల్ప గాయాలయ్యాయి.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ..యువకుడి మృతి



మృతుడు గోకులకృష్ణ

నారాయణవనం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఎస్ఐ రాజశేఖర్ కథనం మేరకు.. మం డల పరిధిలోని వెత్తలతడుకు గ్రామానికి చెందిన బాలసుబ్రమణ్యం కుమారుడు గోకులకృష్ణ (20) కైలసనాథకోనకు వెళ్లి స్వగ్రామానికి వెళ్తుండగా పడమేటమ్మ ఆలయ సమీపంలో పుత్తూరు నుంచి చెన్నైకి వెళుతున్న లారీ ఢీకొంది. గాయపడిన గోకులకృష్ణను తిరుపతి వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సొమ్మసిల్లి పడిపోయిన సాధువు

● తలకు బలమైన గాయం



శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి: శ్రీకాళహస్తీశ్వరాలయం మూడో గేటు వద్ద బుధవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని సాధువు క్యూలైన్లో సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. తల వెనుక బలమైన గాయం కావడంతో రక్తస్రావం జరిగింది. వెంటనే ఆలయ అంబులెన్సులో ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, బుధవారం సాయంత్రం ఆలయంలోని దక్షిణామూర్తి సన్నిధిలో తెలంగాణకు చెందిన భక్తుడు.. రాజమహేంద్రవరానికి చెందిన ఓ మహిళ వేర్వేరు సమయంలో సొమ్మసిల్లి పడిపోయారు. వీరు ఉపవాస దీక్ష వల్ల నీరసించి పడినట్లు వైద్యవర్గాలు తెలిపాయి. వైది సిబ్బంది హుటాహుటిన సహాయక చర్యలు అందించారు.

ముక్కంటి సేవలో 'కన్నప్ప'



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా బుధవారం కన్నప్ప సినిమా బృందం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మోహన్‌బాబు, విష్ణు, ప్రభుదేవా తదితరులు దర్శించుకున్న వారిలో ఉన్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద కన్నప్ప బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. వీరికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, బీజేపీ నేత కోలా ఆనంద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి



గూడూరు: బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలు




చిట్టమూరు: యాకసిరితిప్పపై శివలింగాలను దర్శించుకుంటున్న భక్తులు - తడ: చిన్నమాంబట్టు కాశీవిశ్వేశ్వరాలయంలో గోపూజ

మార్మోగిన శివనామస్మరణ

గూడూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. పట్టణంలోని శివాలయాల్లో స్వామివారిని భక్తులు దర్శించుకుని పూజలు జరిపారు. శివలింగాలకు అభిషేకాలు చేసి హోమ పూజలు జరిపారు. స్థానిక భువనేశ్వరిదేవి సమేత మూలస్థానేశ్వరస్వామి (పెద్దశివాలయం)లో విశేష కుంకుమార్చన, స్వామివారికి రుద్రాభిషేకం, శివపార్వతుల కల్యాణమహోత్సవం, లింగోద్భవకాల రుద్రాభిషేకం, స్వామి, అమ్మవార్ల మాఢ ఉత్సవం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక మీనాక్షీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి పాలతో అభిషేకాలు జరిపారు. వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి గ్రామోత్సవం జరిపారు. రెండోపట్టణ పరిధిలోని కామాక్షీదేవి సమేత ఉమామహేశ్వరస్వామి ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శివపార్వతులకు వైభవంగా కల్యాణ మహోత్సవం జరిపారు. సాయిసత్సంగ నిలయంలో నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో శివలింగానికి అన్నాభిషేకం జరిపి హోమపూజలు నిర్వహించి వైభవోపేతంగా శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనాన్ని ఏర్పాటు చేశారు. చెన్నూరులోని కామాక్షీ సమేత సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐసీఎస్ రోడ్డులో పేటేటి రమణయ్య జ్ఞాపకార్థం ఆయన నివాసం వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు.

చిల్లకూరు: చేడిమాలలోని కామాక్షీ సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. రామాంజ నేయ యుద్ధ నాటకాన్ని ప్రదర్శించారు. బూదనంలోని భవానీ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో అభిషేకాలు, భవానీశంకర్ ఆలయంలో రుద్రాభిషేకం, పాలాభిషేకం నిర్వహించారు.



గూడూరు: సాయిసత్సంగ నిలయంలో శివలింగానికి పసుపుతో అభిషేకం

వెంకటగిరి టౌన్: పట్టణంలోని కాశీ విశ్వనాధస్వామి ఆలయం, రామలింగేశ్వర స్వామి ఆలయం, కర్ణకమ్మవీధిలోని హరహర క్షేత్రం, వల్లివేడు క్రాస్ వద్ద భ్రమరాంబ మల్లికార్జున ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

ఓజిలి: మండలంలోని ఓజిలి, ఆరిమేనిపాడు, సగుటూరు, కరబల్లవోలు, అత్తివరం గ్రామాల శివాలయాల్లో పూజలు చేశారు. భట్లకనుపూరులో వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవాలయంలో ఉదయం గణపతి పూజ, రుద్రాభిషేకం చేశారు. స్వామి, అమ్మవార్లకు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గున్నంరెడ్డి మధుసూదనరెడ్డి కుటుంబీకులు 50 కిలో వెండి ఆభరణాలు, ఆలయ ఉపకరణాలుగా పాత్రలు అందజేశారు. పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ఈవో రవికృష్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

21 టన్నుల గుట్కా స్వాధీనం

రేణిగుంట, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : 21 టన్నుల గుట్కాను ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఈ సంఘటన బుధవారం ఉదయం స్థానిక రైల్వే గూడ్స్ యార్డులో చోటుచేసుకుంది. ఢిల్లీలో తయారైన 21 టన్నుల గుట్కాను రైల్వే గూడ్స్ క్యారియర్ కోచ్‌లో రేణిగుంట రైల్వే స్టేషన్‌కు తరలించారు. ఇక్కడి నుండి మూడు లారీల ద్వారా బెంగళూరుకు తరలించే క్రమంలో పోలీసులు పట్టుకున్నారు. అయితే ప్రభుత్వ అనుమతులు లైసెన్సులతోనే రవాణా చేస్తున్నామని ఇందుకు సంబంధించిన పత్రాలతో పాటు హైకోర్టు ఆర్డర్ కాపీలను కంపెనీ సభ్యులు చూపించడంతో పోలీసులు గుట్కా లారీలను వదిలేశారు.

పన్నులు ఎగవేసేందుకే..?

ఒక రాష్ట్రంలో తయారయ్యే వస్తువును మరో రాష్ట్రంలో విక్రయించాలి అంటే ఆ రాష్ట్ర నిబంధనల మేరకు జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే కర్ణాటక రాష్ట్రంలో గుట్కాకు అధికంగా ట్యాక్స్ ఉండడంతో గుట్కాను రేణిగుంటలో దించుకుని ఇక్కడి నుంచి కర్ణాటకకు తరలిస్తున్నారని సమాచారం. అదే సమ యంలో తమిళనాడులో గుట్కాపై నిషేధం ఉండడంతో రేణిగుంట నుంచి అటు తమిళనాడుకు సైతం తరలిస్తున్నారని అనుమానం ఉంది. గూడ్సు ద్వారా తక్కువ చార్జీలతో బెంగళూరుకు సరుకు తరలించే అవకాశం ఉన్నా రేణిగుంట నుంచి తరలించడం ఇందుకు బలం చేకూరుస్తోంది.



గుట్కా అనుమతులను పరిశీలిస్తున్న పోలీసులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీకాళస్తి ఆలయంలోని ధూర్జటి కళాప్రాంగణంలో బుధవారం జరిగిన నృత్య రూపకాలు అమోఘంగా సాగాయి. ఉదయం 8.30 గంటలకు తిరుపతికి చెందిన పుష్ప నృత్య ప్రదర్శనతో బుధవారం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 9గంటలకు పట్టణానికి చెందిన సుదీక్ష, 9.30 ఇషితశ్రీ, 10గంటలకు ఆశ్రిత, 10.30 అరుణ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. 11గంటలకు తిరుపతి చెందిన శాఖమూరి రవిచంద్రబాబు ఆధ్యాత్మిక ప్రవచనం వినిపించారు. 11.30గంటలకు పట్టణానికి చెందిన తనూజ, మధ్యాహ్నం 12గంటలకు తనూజ నృత్యప్రదర్శనలు, 12.30గంటలకు గురవరాజు పల్లికు చెందిన చంద్ర మోహన్ భక్తిరంజని జరిగింది. 1 గంటకు పట్టణానికి చెందిన సరయు నృత్య ప్రదర్శన, 1.30కు మోక్ష భరత నాట్య ప్రదర్శన, 3గంటలకు నాయుడుపేటకు చెందిన మౌనిక, 4గంటలకు పట్టణానికి చెందిన అనంతలక్ష్మి, 5గంటలకు బొజ్జ భవ్య సాహిత నృత్య ప్రదర్శనలు అబ్బురపరిచాయి. సాయంత్రం 6గంటలకు పట్టణానికి చెందిన సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భక్తిరంజని జరిగింది. రాత్రి 8.30గంటలకు మంజూష నృత్య ప్రదర్శనలు జరిగాయి. చివరగా పల్లంపేటకు చెందిన సాయిబాబా నాట్యమండలికి చెరందిన రామచంద్ర ప్రదర్శించిన రామాంజనేయ యుద్ధం నాటకంతో బుధవారం సాంస్కృతిక కార్యక్రమాలు ముగిశాయి.




నృత్యం చేస్తున్న కళాకారిణి, గానం చేస్తున్న గాయని స్మిత

84 మంది తిరుపతి విద్యార్థులకు ఊరట

● చిత్తూరు జిల్లాలో పరీక్ష రాసేలా అనుమతించిన ఇంటర్‌బోర్డు అధికారులు

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు, తిరుపతి జూనియర్ కళాశాలల యాజమాన్యాల నిర్వాకంతో 84 మంది విద్యార్థులకు హాల్ టికెట్లు రాని విషయం తెలిసిందే. ఎట్టకేలకు వీరికి చిత్తూరు జిల్లాలోనే పరీక్షలు రాసేలా ఇంటర్‌బోర్డు అధికారులు అనుమతించడంతో కథ సుఖాంతమైంది. వివరాల్లోకి వెళితే.. పెనుమూరులో శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాలను నిర్వాహకుడు సురేంద్రరెడ్డి ఏడాది కిందట తిరుపతి బైరాగిపట్టెడలోని ఎస్ఎస్ఆర్ కళాశాలకు చెందిన ఓంప్రకాష్ అనే వ్యక్తికి అమ్మేశాడు. ఈ క్రమంలో తిరుపతికి చెందిన 84 మంది విద్యార్థుల పేర్లు మాత్రం పెనుమూరులోని కళాశాలలో ఉన్నట్లు ఇంటర్మీడియట్ లాగిన్‌లో నమోదైంది. నిర్వాహకుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లించలేదు. దీంతో హాల్ టికెట్లు రాలేదు. ఈ వ్యవహారం రెండు జిల్లాల్లో చర్చనీయాంశంగా మారి, చివరకు కమిషనరేట్ కార్యాలయానికి చేరింది. అక్కడి అధికారుల సూచనతో విచారణ చేపట్టాలని డీవీఈవో సయ్యద్ మౌలను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. పెనుమూరు కళాశాల నిర్వహణ లోపాన్ని గుర్తించిన అధికారులు.. యాజమాన్యానికి నోటీసులు కూడా ఇచ్చారు. దీనిపై 'లేని కాలేజ్.. ఉన్నట్లుగా..!?' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఆదివారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.

మానవతా దృక్పథంతో..

84 మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షలు రాసే అవకాశం ఇవ్వాలని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు పెనుమూరు కళాశాలను కొనుగోలు చేసిన తిరుపతి ఎస్ఎస్ఆర్ కళాశాల నిర్వాహకుడు ఓంప్రకాష్ విజ్ఞప్తి చేశారు. మానవతా దృక్పథంతో కళాశాలకు ఫైన్ విధించడంతోపాటు పెద్ద మొత్తంలో అపరాధ రుసుంతో విద్యార్థుల ఫీజు చెల్లించే వీలును ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు కల్పించారు. అయితే తిరుపతికి చెందిన విద్యార్థుల పేర్లు చిత్తూరు జిల్లా కింద నమోదై ఉన్నాయి. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలను కూడా చిత్తూరులోనే కేటాయించాలని బోర్డు అధికారులు డీవీఈవోకు సూచించారు. 84 మంది విద్యార్థులకు ఒకే సెంటర్ కేటాయిస్తే ప్రశ్నపత్రాల సమస్య తలెత్తుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఒక్కో సెంటర్‌కు ఆరు నుంచి ఏడుగురు విద్యార్థుల చొప్పున చిత్తూరు జిల్లా కేంద్రంలోని పలు సెంటర్లు కేటాయించినట్లు డీవీఈవో తెలిపారు. దీంతో తిరుపతి విద్యార్థులు ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షలు చిత్తూరు జిల్లాలో కేటాయించిన సెంటర్లలో రాయనున్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

రేణిగుంట, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : ఆటో ఢీకొని వృద్ధుడు తీవ్ర గాయాల పాలైన సంఘటన బుధవారం రాత్రి వంతెనపై చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. జ్యోతినగర్‌కు చెందిన వర్మ(62) వంతెనపై రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని ఆటో ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో అతడి తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




ప్రత్యేక ఆకర్షగా కేరళ వాయిద్య కళాకారులు, ఊరేగింపులో స్వామివారికి హారతి ఇచ్చిన భక్తురాలు



ఆర్టీవో అధికారులు ఏర్పాటు చేసిన ఉచిత బస్సు సర్వీసులు



ది స్కూల్ వద్ద పార్కింగ్



ఆకట్టుకున్న విశేష రూపకాలు

శివరాత్రి వేడుక విజయవంతం

● భక్తుల్లో వ్యక్తమైన సంతృప్తి
● రోడ్ల విస్తరణతో వీడిన ట్రాఫిక్ సమస్య
● ఉచిత ప్రసాదాలపై భక్తుల హర్షం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో శివరాత్రి వేడుక దిగ్విజయంగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే సూచనలతో అధికారులు సమగ్ర సమన్వయంతో పనిచేశారు. అని విభాగాల్లోను భక్తులు సంతృప్తి చెందేలా ఈ సారి అధికారులు సేవలందించారు. ఉత్సవాల ముందు నుంచే ప్రణాళికబద్ధంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చేపట్టిన పలు అభివృద్ధి పనులు, రోడ్డు విస్తరణ పనులు శివరాత్రి రోజున భక్తులకు ఎంతో ప్రయోజనంగా నిలిచాయి. ముఖ్యంగా నత్తనడకన సాగుతున్న పూతలపట్టు-నాయుడుపేట ఆరులేన్ల జాతీయ రహదారి పనులను సంబంధిత అధికారులతో చర్చించి పూర్తిచేయించారు. దీంతో పట్టణంలోని బైపాస్ రోడ్డుకు రద్దీ చాలావరకు తగ్గుముఖం పట్టింది. ఇక రాజగోపురం ఉత్తరం వైపున సన్నిదీవీధి, తేరువీదిని కలుపుతూ కొత్తసిమెంటు రోడ్డును నిర్మించారు. రాజగోపురం దక్షిణం వైపున 20 అడుగులు ఉన్న పాతరోడ్డును 45 అడుగులకు విస్తరించారు. ఇక ముక్కంటి ఆలయం రెండవ గేటు వద్ద నాలుగవ గేటు వరకుసన్నిధి వీధిలో ఇరుగ్గా ఉన్న రోడ్డును ఇటీవల 40 అడుగులకు విస్తరించిన విషయం తెలిసిందే. దీంతో ఆలయ పరిసరాల్లో ఏళ్లతరబడి వెంటాడుతున్న ట్రాఫిక్ సమస్య ఈ ఉత్సవాలతో తొలిసారి తీరింది. ఇక ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పట్టణంలోని ట్రాఫిక్ సమస్యను అరికట్టేందుకు శివారు ప్రాంతాల్లో 11 పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పార్కింగ్ కేంద్రాల వద్ద నుంచి శ్రీకాళహస్తి ఆర్టీవో విశ్వనాథనాయుడు ఉచిత బస్సులను ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. ఆర్టీవో అధికారులు సుమారు 50 వాహనాలను పార్కింగ్ కేంద్రాల వద్ద నుంచి ముక్కంటి ఆలయం వరకు నిరంతరం ఉచిత రవాణాకు అందుబాటులో ఉంచారు. అయితే ఉదయం చతుర్మాడ వీధుల్లో స్వామి అమ్మవార్ల ఊరేగింపు సమయంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు కాసేపు స్తంభించాయి.


క్యూలైన్ల ప్రణాళిక సఫలీకృతం

సామాన్య భక్తులు క్యూలైన్లలో స్తంభించకుండా సాఫీగా సాగిపోవడంపై భక్తుల్లో సంతృప్తి వ్యక్తమైంది. 1వ గేటు వద్ద ఉచిత, 2వ గేటు నుంచి రూ.200, 3వ గేటు నుంచి రూ.500, స్థానికులు, నాలుగవ గేటు నుంచి వీఐపీలను అనుమతించారు. ఆలయంలోపల ఎక్కడా క్యూలైన్లు కలిసిపోయి గందరగోళం జరిగే వీలు లేకుండా కట్టుదిట్టంగా ఏర్పాటు చేశారు. ముందుగా స్వామివారి దర్శనం, అనంతరం అమ్మవారి సన్నిధి అక్కడి నుంచి మృత్యుంజయస్వామి సన్నిధి నుంచి ఒకే క్యూలైను ద్వారా భక్తులు వెలుపలకు వచ్చేలా ఏర్పాటు చేసిన విధానం విజయవంతమైంది.


ముక్కంటిని దర్శించుకున్న ప్రముఖులు



ఆలయం వద్ద తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఆలయం వద్ద టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కుటుంబ సభ్యులు



దర్శనానికి వెళుతున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



ఆలయం వద్ద మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు, సత్రవాడ ప్రవీణ్ తదితరులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరిం చుకుని బుధవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో ముక్కంటిని దర్శించు కున్నారు. తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు, నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్, మాజీ ఎమ్మెల్యేలు చదలవాడ కృష్ణమూర్తి, సుగుణమ్మ, సినీనటుడు ప్రభుదేవ, శివబాలాజీ, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, నాయకులు సత్రవాడ ప్రవీణ్ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో బొజ్జల రిషితారెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం, తెప్పోత్సవం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం రథోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 11గంటలకు రథోత్సవం ప్రారంభం కానుంది. శ్రీకాళ హస్తీశ్వరుడు ఒక రథంపైన... జ్ఞానప్రసూనాంబదేవి మరో రథంపై ఊరేగనున్నారు. రాత్రి నారదపుష్కరణిలో శివపార్వతులు తెప్పలపై విహరించనున్నారు. ఇందు కోసం నారద పుష్కరణిని సుందరంగా తీర్చిదిద్దారు.

నిత్య ఉత్సవాల వివరాలు ఇవీ...

- ఉదయం 2 నుంచి 6 గంటల వరకు: లింగోద్భవ దర్శనం
- ఉదయం 2 గంటలకు : పదవ అభిషేకం - శుద్ధి అభిషేకం
- ఉదయం 4.30గంటలకు: పదకొండవ అభిషేకం - బ్రహ్మాభిషేకం (లింగోద్భవం)
- ఉదయం 9గంటలకు: శ్రీస్వామి అమ్మవార్ల పురవీధుల ఉత్సవం
- ఉదయం 11గంటలకు: రథోత్సవం
- సాయంత్రం 5.30గంటలకు : ప్రదోష కాలాభిషేకం
- రాత్రి 8గంటలకు తెప్పోత్సవం
- రాత్రి 9.30గంటలకు: దర్శనం ముగింపు

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం



సత్యవేడు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లప్పగుంటలో అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త రాజేష్ కుటుంబానికి పార్టీ తరపున ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్ ఆర్థిక సాయం అందించారు. బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామానికి చేరుకుని రాజేష్ కుటుంబాన్ని పరామర్శించారు. తనవంతు సాయంగా రూ.10 వేలును రాజేష్ భార్య అరుణకు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివయ్య, వాసు, బాబు, గోవిందరాజులు, వెంకటరమణ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

శివనామస్మరణలతో మార్మోగిన శివాలయాలు





కామాక్షి మూలస్థానేషశ్వర స్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వర కళ్యాణానికి హాజరైన భక్తులు, ప్రత్యేక అలంకరణలో అత్తూరు జీవలింగ నీలకంఠేశ్వర స్వామి

రేణిగుంట, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రిని పురస్కరించుకుని రేణిగుంట మండలంలోని శివాలయాలు శివనామస్మరణలతో మార్మోగాయి. బుధవారం మండలంలో ప్రసిద్ధిగాంచిన గాజులమండ్యం శ్రీకామాక్షి సమేత మూలస్థానేశ్వర స్వామి, వెదళ్లచెరువు ఓంకార జ్యోతి లింగేశ్వర స్వామి, అత్తూరు జీవలింగ నీలకంఠేశ్వర స్వామి ఆలయాల్లో, పట్టణంలోని వెంకటేశ్వర, కరిమారియమ్మ ఆలయంలోని ఉప శివాలయాల్లో విశేషపూజలు నిర్వహించారు. కామాక్షి సమేత మూలస్థానేశ్వర స్వామి, ఓంకార జ్యోతి లింగేశ్వర ఆలయాల్లో స్వామి, అమ్మవార్ల కళ్యాణానికి భక్తులు పోటెత్తారు. సాయంత్రం ఊంజల్‌సేవ, నంది వాహనంపై పార్వతి పరమేశ్వరులు భక్తులను అనుగ్ర హించారు. భక్తులకు ఆలయాల్లో అన్నదానం చేశారు.

చెట్టు కిందే శివయ్యకు ప్రత్యేక పూజలు



కేవీబీపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపల్లి గ్రామంలో వెలసిన శివయ్యకు చెట్టుకిందనే మహాశివరాత్రి సందర్భంగా పూజలు నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ శివాలయం నిర్మించాలన్న కోరిక తీరక పోవడంతో ఈ యేడాది కూడా చెట్టు కిందనే శివయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలో ఎక్కడా శివాలయాలు లేక పోవడంతో పలు గ్రామాల నుంచి ప్రజలు అధికసంఖ్యలో చెట్టుకింద శివయ్యకు పూజలు నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

సత్యవేడు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలను మండలంలో ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సత్యవేడులోని భూపతీశ్వరాలయం, కళ్యాణ వీరభద్రస్వామి ఆలయం, వనరాజవిఘ్నేశ్వర స్వామి ఆలయం, ఇరుగుళంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయం, మదనంబేడులోని రామలింగేశ్వరాలయం, కన్నవరంలోని మలతోషుస్వామి తదితర శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో స్వామివారికి విశేషంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. రాత్రి శివపార్వతుల కళ్యాణోత్సవం జరిపిం, గ్రామోత్సవం చేపట్టారు. ● శ్రీసిటీలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శివుని దివ్య స్వరూపంగా భావించే రుద్రాక్ష వృక్షం వద్ద పూజలు చేశారు.

ఆగమోక్తం ప్రసన్న వెంకటేశ్వరుని ధ్వజారోహణం



ప్రత్యేక అలంకారంలో శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం తొండమాను పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న అభయ హస్త ఆసీన వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ధ్వజారోహణం ఆగమోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి పలురకాల పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. ఈ పూజలు టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. రాత్రి స్వామివారు శేషవాహనంపై ఊరేగి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

వేడుకగా మహాశివరాత్రి ఉత్సవం



కాంబాకం శివాలయం

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలంలో మహాశివరాత్రి పండుగ అత్యంత వేడుకగా జరిగింది. మండలంలోని వరదయ్య పాళెం, సంతవేలూరు, కళత్తూరు పంచాయతీలోని వడ్డిపాళెం, కాంబాకం శివాలయాలను భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ ఆవరణంలో నిర్వాహకులు అన్నదానం చేశారు. కాగా వడ్డిపాళెం శివాలయానికి మైసూరుకు చెందిన భక్తులు ఉదయ్, జయశ్రీ పంచలోహ నాగాభరణం, వెండి విభూది తట్ట, రుద్రాక్షమాల, అభిషేకం వస్తువులను అందజేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లు గ్రామవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు.

ముక్కంటి సేవలో కలెక్టర్



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వ రాలయాన్ని బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు.

కైలాసవాసా కరుణించు తండ్రీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి క్షేత్రం బుధవారం శివనామ స్మరణతో మార్మో గింది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయాలతో పాటు వివిధ శివాలయాల్లో భక్తులు పోటె త్తారు. పట్టణ శివారులోని స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అర్ధనారీశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలను ఘనంగా జరిగాయి. వేకువజాము నుంచే భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పెద్దఎత్తున దాతలు ఇక్కడ భక్తులకు అన్నదానం చేశారు. ఇక పట్టణంలోని ముత్యాలమ్మగుడి వీధిలో వెలసిన చక్రేశ్వర స్వామి, పానగల్‌రోడ్డులో వెలసిన సంపతీశ్వర స్వామి, వేడాం మార్గంలోని మూకేశ్వరస్వామి, కుందేటివారివీధిలోని బృహదీశ్వరస్వామి, వేడాం గ్రామం లోని వేయిలింగాలకోన, భైరవకోన, తుపాన్‌సెంటర్ నీలకంఠేశ్వరస్వామి, భరద్వాజ తీర్థం, కుమారస్వామి తిప్పలోని శివాలయాల్లో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్తులు ఉపవాస దీక్షతో దీపారాధనలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేక అలంకారంలో చక్రేశ్వరస్వామి

అవస్థలమయం అర్ధనారీశ్వర దర్శనం





ప్రత్యేకాలంకారంలో అర్ధనారీశ్వరస్వామి, ఆలయం వద్ద భక్తులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అర్ధనారీశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. అయితే సరైన సౌకర్యాలు, వసతులు లేక భక్తులకు అడుగడుగునా అవస్థలు తప్పలేదు. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని బైపాస్ వంతెనకు సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున అర్ధనారీశ్వరాలయం వెలసిన విషయం తెలిసిందే. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఈ ఆలయ నిర్వహణ సాగుతోంది. బుధవారం మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని భక్తులు అర్ధనారీశ్వరాలయానికి భారీగా తరలివచ్చారు. సుమారు 25వేల మందికి పైగా ఆలయానికి విచ్చేశారు. అర్ధనారీశ్వరాలయ మండపం పునర్నిర్మాణం జరుగుతోంది. భారీఎత్తున భక్తులు వస్తారని తెలిసినా అధికారులు అవసరమైన స్థాయిలో ఏర్పాట్లు చేయలేదు. క్యూలైన్లు గంటల కొద్దీ స్తంభించిపోయాయి. క్యూలైన్ల వద్ద ఒక్క ఫ్యాన్ కూడా ఏర్పాటు చేయలేదు. గంటల పాటు క్యూలైన్లలో ఉక్కపోతతో భక్తులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. కనీసం క్యూలైన్లలో తాగునీరు లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్యం ఊసే లేదు. అదేవిధంగా బైపాస్ వంతెన నుంచి ఆలయం వరకు మట్టిరోడ్డుపై కనీసం నీరు కూడా చల్లకపోవడంతో దుమ్ముతో భక్తులు ఇబ్బంది పడ్డారు.

శివనామంతో మార్మోగిన శైవ క్షేత్రాలు





విశేష అలంకరణలో కైలాసనాథ స్వామి, ప్రత్యేక పూజలందుకుంటున్న కామాక్షి దేవి అమ్మవారు

నారాయణవనం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం మండలంలోని శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. వేకువ జామున నుంచే ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ప్రముఖ పర్యాటక కేంద్రమైన కైలాసనాథ కోనలో కామాక్షింబిక సమేత కైలాసనాథ స్వామివారికి ఎమ్మెల్యే ఆదిమూలం పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కైలాసనాధుని ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. కైలాన కోన జలపాతంలో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి కామాక్షిదేవి సమేత కైలాసనాథుడిని దర్శించుకున్నారు. బిల్వదళాలతో అర్చనలు చేశారు. వేకువజామున 2 గంటలకు కైలాసనాథునికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. టీటీడీ అనుబంధ ఆలయాలైన చంపకవల్లీ పరాశరేశ్వర, మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వర ఆలయంతో పాటు తుంబూరు వెలసిన తుంబీశ్వరస్వామి, పాలమంగళం పాలీశ్వర స్వామికి వేకువజామున అభిషేకాలను నిర్వహించారు. ఆలయాల వద్ద ముత్తం ఫౌండేషన్‌తో పాటు పలువురు అన్నదానాలు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు శ్రీనివాసయాదవ్, సభ్యులు పురుషోత్తం, మాజీ చైర్మన్ బత్తల భాస్కర్‌యాదవ్, ఎస్ఐ రాజశేఖర్, ఈవో కృష్ణనాయక్ పాల్గొన్నారు.

రామగిరిలో భక్తి ప్రపత్తులతో మహా శివరాత్రి పూజలు



దర్శన అనంతరం ఎమ్మెల్యే ఆదిమూలాన్ని సన్మానిస్తున్న ఈవో లత

పిచ్చాటూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామగిరిలో వెలసిన వాలీశ్వర స్వామి ఆలయంలో బుధవారం మహాశివరాత్రి అభిషేక పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు శంకర్ గురుకుల్ శాస్త్రోక్తంగా పంచామృతాలతో అభిషేకించారు. వివిధరకాల పుష్పా లతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అభిషేకానికి ఉభయదారులుగా మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్రనాయుడు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. దాతలు భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి జాగారానికి ఆలయ ప్రాంగణంలో భక్త మార్కండేయ హరికథ కాలక్షేపం ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో లత, అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే ఆదిమూలం దర్శన టికెట్ కొని సాధారణ భక్తుడిలా వెళ్లి స్వామివారిని దర్శించు కున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్ రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శివరాత్రి వేడుకలు



పెద్ద పాలేడులో శివ భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజుల పెళ్లూరు, పెద్దపాలేడు, కాంపాళెం, తదితర శివాలయాలలో మహా శివ రాత్రి వేడుకలను ప్రజలు బుధవారం ఘనంగా నిర్వహించు కున్నారు. ప్రజలు శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. బీఎన్ కండ్రిగలో, కాంపాళెం గ్రామాలలో భక్తులకు అన్నదానం చేశారు.

ఆక్రమణ అడ్డగింత

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండల సముదాయం ఎదురుగా సర్వే నెంబరు 253లో ఉన్న భూమిని ఇంటి స్థలాలుగా ఇవ్వాలని రెండు మా సాలుగా కనమనంబేడు గ్రామస్తులు దర్నాలు, నిరసనలు చేపట్టారు. అధికారులు స్పందించకపోవడంతో బుధవారం ఆక్రమణకు యత్నించారు. తహసీల్దార్ సుబ్రమణ్యం ఆదే శాలతో ఆర్ఐ నల్లయ్య, వీర్వో బాలమురళి, పోలీసులు వారిని అడ్డుకున్నారు.

భక్తులకు అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న యంగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో పలుచోట్ల భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీసీడ్స్ కూడలి వద్ద మప్పేటి నాగరాజు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి హాజరై భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మదురెడ్డి, మప్పేటి సుబ్రహ్మణ్యంరెడ్డి, సాయిరెడ్డి, కార్తీక్, హేమంత్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తొట్టంబేడు మండలం కొత్తూరులో వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద టీడీపీ నాయకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమేష్‌రావు, నివేదిత, బాలసుబ్రహ్మణ్యం, భాస్కర్, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు. ● ఎల్ఐసీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో, యంగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ, గౌడ సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. మరికొన్ని సంఘాల వారు భక్తులకు నీరు, మజ్జిగ, నిమ్మ రసం పంపిణీ చేశారు. అదే విధంగా శ్రీబాలాజీ తిరుపతి జిల్లా గౌడ సంఘం నాయకులు భక్తులకు అన్నదానం చేశారు.



అన్నదానం చేస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి తదితరులు



శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ధూర్జటి కళాప్రాంగణంలో విజయవాడకు చెందిన అరుణోదయ సమితి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శన ముగ్ధమనోహరంగా సాగింది. దూరదర్శన్ గ్రేడ్ ఆర్టిస్ట్ లత మంజూష బృందం పలు శివకీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. ఆహూతులను ఈ నృత్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఆలయ అధికారులు వీరికి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. - శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి)

గుడిమల్లానికి పోటెత్తిన భక్తులు

రేణిగుంట, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : గుడిమల్లం పరశురామేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. గత ఏడాది 20వేల నుండి 30 వేల మంది వరకు భక్తులు దర్శించుకుంటే ఈ ఏడాది 30 నుంచి 40వేల పైచిలుకు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల మధ్య పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో గందరగోళం నెలకొంది. అదే సమయంలో వీఐపీలను దర్శనానికి వదలడంతో క్యూలైన్లలోని భక్తులు ఆలయ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు సర్దిచెబుతుండగా మరో గేటు ద్వారా దర్శనానికి వదలడంతో ఒక్కసారిగా కొంతతోపులాట జరిగింది. పోలీసులు క్యూలైన్ల వద్దకు చేరుకుని భక్తులను క్రమబద్ధీకరించారు. కాగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె అక్కడ మీడియాతో మాట్లాడుతూ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు.

వైభవంగా శివోత్సవం

- శివనామ స్మరణలతో మార్మోగిన పల్లికొండేశ్వరాలయం
- స్వామి, అమ్మవార్లకు టీటీడీ పట్టు వస్త్రాలు సమర్పణ
- వృషభ వాహనంపై స్వామి, అమ్మవార్ల చిద్విలాసం

నాగలాపురం, ఫిబ్రవరి 26, (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండల పరిధిలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో బుధవారం ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో మహాశివరాత్రి మహోత్సవాలను (శివోత్సవం) అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి పోటెత్తారు. ఎమ్మెల్యే ఆదిమూలం స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుకుల్ ఆలయంలోని పరివార దేవతలకు అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని యాగశాల మండపంలో శాస్త్రోక్తంగా యాగశాల పూజలు నిర్వహించి పూర్ణాహుతి జరిపారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, తాగునీటి వసతి, ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన పుష్పాలంకరణ, విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఎస్ఎం ఫౌండేషన్ ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకు ఉచిత ప్రసాదాలు, నిత్యాన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం మూల స్థాన మూర్తులైన సర్వమంగళాదేవి సమేత వాల్మీకేశ్వర స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం పట్టు వస్త్రాలతో, బంగారు ఆభరణాలతో దివ్యాంగ సుందరంగా మస్తాబు చేసి దీప, ధూప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను వృషభ వాహనంపై అధిష్టింప జేసి నక్షత్రహారతి, కుంభ హారతి, మహా హారతులు చేపట్టారు. ఈ పూజలకు ఆలయ మాజీ చైర్మన్ ఏ.వి.ఎం మునిశేఖర్ రెడ్డి ఉభయ దారులుగా వ్యవహరించారు. మంగళ వాయిద్యాల నడుమ, కోలాటాలు, భజన బృందాలు నడుమ వృషభ వాహనంపై స్వామి, అమ్మవార్లు తిరువీధుల్లో విహరించారు. రాత్రి ఆలయ ఆవరణలో అన్నై కళాక్షేత్రం వారిచే భరత నాట్య కార్యక్రమం జరిగింది. వాహన సేవతో కార్యక్రమాలను పరిసమాప్తి చేశారు.



వృషభ వాహనం పై స్వామి, అమ్మవార్లు

స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పణ

టీటీడీ తరపున టీటీడీ సూపరింటెండెంట్ హిమత్‌గిరి, జబేదార్ గిరిధర్ నాయుడులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయానికి వచ్చిన టీటీడీ అధికారులకు ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణ కుంభ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు కల్పించారు. ఆలయ ప్రదోష మండపంలో టీటీడీ అధికారులకు ఆలయాధికారి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.